# అజ్ఞాత గమ్యం

విశ్వాంతరాల్లోని కక్ష్యల్ని సైతం ఈనాటి క్షిపణులు చేధించగలవు. అనూహ్యామయిన అగ్నిగోళాల్ని అణుబాంబులు సృష్టించగలవు. ప్రపంచాధినేతలంతా శిఖరాగ్ర సభల్లో మమేకమయ్యారు. వారిక ఇంటిదారి పట్టే జాడలు కనిపించడం లేదు. అత్యాధునిక సూపర్‌సోనిక్ విమానాల వేగం కాంతి పథాన్ని భయపెడుతోంది. దూరాలు చేధించ బడ్డాయి. జ్ఞాపకాలు బేధించబడ్డాయి. జాతీయ సౌభ్రాతృత్వం ప్రపంచ ప్రభుత్వపు ప్రమాణాల్నీ, ప్రమాదాల్నీ తనలో తప్పనిసరి తత్వంగా నిక్షిప్తం చేసుకుంది.

విశ్వమానవులే విశ్వానికి వారసులు. ప్రపంచ పాలకులు. ఒక అద్భుతమైన లోకం, నూతన అద్వితీయ సంస్కృతి, సరిహద్దుల్లేని సర్వమానవ శ్రేయోజగత్తు, వారికోసం ఎదురు చూస్తున్నాయి.

అప్పుడిక స్వార్ధపు స్వభావాలకీ – మానసిక శూన్యాలకి చిహ్నాలైన విభజనలకి తావుండదు. అకాల అహంభావాలకసలే ఆస్కారముండదు. నూతన సత్యాలే అవతరిస్తుంటాయి. కొత్త విషయాలు మాత్రమే ఉద్భవిస్తుంటాయి. బహుశా అదే ఒక సరికొత్త స్వార్ధాతీత మానవుడు ఆవిర్భవించే మరో ప్రపంచమేమో.

మూతపెట్టిన మానవాళి భవిష్యదర్శినిలోంచి ఈ మహనీయుడయిన మానవుడి ఆగమనాన్ని నేను లీలగా చూడగలుగుతున్నాను. ఈ అనంత కాలవాహినిలో నా ప్రస్థానపు అడుగుజాడల్ని అన్వేషిస్తూ, నా అస్తిత్వానికి ఆద్యంతాలని నిర్దేశించి దానికే జీవితమనే సార్ధక నామకరణం చేసుకున్నాను.

నేను వెళ్ళిపోవచ్చు, లేదా వేచి వుండవచ్చు. నా కథ ఇక్కడితో అంతం కావచ్చు. లేక అదే నూతన ఆరంభమూ అవ్వొచ్చు. ఏది ఏమైనా ప్రతీదీ చారిత్రక చలనం కోసం సంకల్పించేదే. ఘటనల గమనంలోంచి సామూహికంగా సంఘటనల్లో చేరేదే. అజరామర ప్రవాహంలో అజ్ఞాతంగా కలిసి మిళితమైపోయేదే.

సోక్రటీస్ మహాశయుడి సాక్షిగా ప్రపంచానికి ప్రణమిల్లి ప్రకటిస్తున్నాను, 'నాకేమీ తెలీదు, అస్సలేవీ తెలీదు'

నాకు దేనిమీదా ద్వేషం లేదు. విద్వేషం అంతకన్నా లేదు. అయిష్టం ఏ కొద్దివాటి మీదో తప్పలేదు. మానవత్వమంటే నాకిష్టం. అయినా కూడా కొందరినే నే ప్రేమించ గలిగాను. నా ప్రేమని కొంతమందికే పంచగలిగాను.

మీ ముందు నా మనసు తెరలు దించే సమయం వచ్చింది. ఈ సమయంలో విభిన్న విషయాలు నా మనోఫలకంపై సుమనోహరంగా అవిరామ నృత్యం చేస్తున్నాయి. ఒక సర్వపరిత్యాగయిన సన్యాసి ఇప్పుడే నా గుండెలో తన గొంతుతో ఇలా ఉపదేశిస్తు న్నాడు,

**'సర్వలోకాః సుఖినోభవంతు'**

# పురుషుడు - స్త్రీ



**మూలం : చలం**

**స్వేచ్ఛానువాదం : గౌరవ్**

**ప్రకృతి ప్రచురణలు**

పిఠాపురం

తూర్పుగోదావరి జిల్లా

**పురుషుడు-స్త్రీ**

| | |
|---|---|
| ప్రథమ ప్రచురణ (ఆంగ్లంలో) | : 1925 |
| ప్రస్తుత ప్రచురణ (తెలుగులో) | : 2014 |
| ప్రతులు | : 500 |
| విరాళం | : రూ. 10/- |
| అట్టమీద ముఖ చిత్రం | : బాపు (చలం Man & Woman నుంచి తీసుకోబడింది) |
| అట్టవెనుక ప్రకరణం | : పిఠాపురం యువరాజా R.V.M.G. రామరాజు గారి ఆత్మకథ "Of Men, Matter And Me" లో "Destination Unknown" అనే అధ్యాయానికి నేనెన్నడో చేసిన అనువాదం. |
| ప్రచురణ సంఖ్య | : 11 |
| ప్రతులకు | : ప్రశ్న అధ్యయన వేదిక<br>94410 89829, 94400 40826 |


**గమనిక**

అనువాదాల్చేయడం నాకభ్యాసం లేదు. అందువల్ల ఇందులోని తప్పుల్ని తెలిపితే సరిచేసుకుంటాను. కొన్నిసార్లు తప్పనిసరిగా తెలుగు భాషకి అనుగుణంగా భావాన్ని మూలం చెడకుండా అనుసరించడానికి ప్రయత్నించాను. ముందు 'స్త్రీ పురుషులు' అనే శీర్షిక అనుకున్నప్పటికీ మూలంలోలాగా 'పురుషుడు–స్త్రీ' అనేదే ఖరారు చేయడం జరిగింది. ఈ వ్యాస అనువాదం ఇప్పటిదాకా ప్రత్యేకంగా తెలుగులో వచ్చినట్లు మా దృష్టికైతే రాలేదు. యాదృచ్ఛికమే ఐనా చలం జయంతి–వర్ధంతులు కూడా ఈ (మే) మాసంతోనే ముడిపడున్నాయి. కావున, ఈ ప్రయత్నంతో ఆయన్ని స్మరించుకోవడం జరుగుతోంది.

**మా ఇతర ప్రచురణలు**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | ప్రజాస్వామ్య పతనం | 20/- | 7. | మద్యంపై యుద్ధం | 10/- |
| 2. | అరాజకత్వం అంటే ఏమిటి? | 10/- | 8. | మతానికి మరణశాసనం – మనిషికి పునరుజ్జీవనం | 5/- |
| 3. | సాంఘిక తత్వం – విప్లవ మార్గం | 20/- | 9. | కరపత్రాల కథా కమామీషు | 40/- |
| 4. | ఒక నాస్తికుడి నామా | 15/- | 10. | తత్వవిచారణ–తర్క వివేచన | ఐచ్ఛికం |
| 5. | ప్రజాస్వామ్య ప్రస్థానం | 10/- | | | |
| 6. | అస్తిత్వం – అరాజకత్వం | 20/- | | | |

# ప్రకాశకుల మాట

ఆధునికతనుకొంటూ ప్రకృతినీ, ఆధిపత్యం పేరుతో ఆడదాన్నీ శతాబ్దాలుగా సమాజం దోచుకుంటూనే ఉంది. అత్యంత బాధాకరమయిన విషయమేమిటంటే కొత్త తరాలకి స్త్రీ అణిచివేతని పరిచయం చేస్తూ దాన్నొక నిరంకుశ అలవాటుగా మార్చడం తప్పనిసరి బాధ్యతగా ప్రతీ వ్యవస్థ భావిస్తోంది. అందుకే అన్ని రంగాల్లోనూ ఈ అన్యాయం అప్రకటితంగానే అమలవుతోంది. మగాళ్ళుగా వాళ్ళ స్వభావంలోని పశుప్రవృత్తికి కారణాన్ని వెతకడం మొదలెడితే అదొకచోట ఆగదు. స్త్రీని సొంత ఆస్తిగా పరిగణించే వంకర ఆలోచనలు పురుషుల రక్తంలో దాదాపు సహజాతంగా స్థిరపడిపోయాయి.

అసాధారణంగా కనిపించాలనే ఆతృతలో సహజత్వం చచ్చిపోయి ఉత్త కృత్రిమత్వం మిగులుతుంది. మొదట్నుంచీ ఆడది తనకెలా బాగుంటుందో అలా తయారుచేయడం చేసాడు మగాడు. సజీవమయిన స్త్రీని గీకి, గిచ్చి, గిల్లి, నలిపి, కొరికి, నాకి, వొత్తి, పిసికి ఆ మిగిలిన నిర్జీవ పదార్థంతో సాంగత్యానికి వెంపర్లాడుతున్నాడు వెర్రివాడు. తల్లిగా తల్లడిల్లుతూ, భార్యగా బాధపడుతూ, కూతురిగా కృంగిపోతూ, కోడలిగా కుళ్ళిపోతూ, అక్కలుగా, చెల్లెళ్ళగా, వదినలుగా, అమమ్మలుగా, నాయనమ్మలుగా, అత్తలుగా, పిన్నిలుగా.... అంతా, భావనలుగా నలిగిపోతున్నారు. భౌతికంగా కూడా నశించిపోతున్నారు.

మన పదాల్లో ఆమొక తిట్టు. మన భాషకి ఆమొక బూతు. మన ఆలోచనలకి ఆమొక ఆశ. మన ఆదేశాలకి ఆమొక దశ. మన ఆవేశాలకి ఆమొక దిశ. మన మనసుకి ఆమొక వ్యసనం. మన శరీరానికి ఆమొక అవసరం. మన స్వభావాలకి ఆమొక విలాసం. మొత్తంగా నడుస్తున్న వ్యవస్థకి స్త్రీ అంటే మూర్తీభవించిన సామూహిక వాంఛ. జీవితంలోని ప్రతి అంశాన్నీ నిజాయితీగా స్త్రీల కోణం నుండి చూసే ధైర్యం లేక వారి హక్కుల్ని కాలరాస్తూ ఉన్నంతవరకూ మగాళ్ళ అహంకారం ఏదో రూపంలో అమలవుతూనే వుంటుంది. దాన్ని మంటగలపనంతవరకూ మానవ సంబంధాల్లోని అసమానతలని సమూలంగా అంతం చేయలేం.

1925లో మొదటిసారి అచ్చయిన Man and Woman అనే ఈ చలం వ్యాసం ఆయన రచనల్లోకెల్లా ఉత్కృష్టమైందని మేమనుకుంటాము. దీన్ని విస్తరించే ఆయన తన ప్రసిద్ధ రచన 'స్త్రీ' చేసారు. చలం 'స్త్రీ'కి మూలమైన ఈ వ్యాసం తెలుగులో రావలసిన అవసరాన్ని గుర్తించి దీన్ని తెలుగులోకి తేవడం జరుగుతోంది. అనువాదంలోని తప్పులకు మాదే బాధ్యత. బౌద్ధాన్నీ – రాహుల్ సాంకృత్యాయన్‌నీ, మానవవాదాన్నీ – రాయ్‌నీ, కులాన్నీ – అంబేద్కర్‌నీ అర్థం చేస్కోడంలో జాతీయ మేధావులెక్కడున్నారో, ప్రాచీన విజ్ఞాన శాస్త్రాన్ని – కాట్రగడ్డ బాలకృష్ణనీ, స్త్రీవాద దృక్పథాన్ని – చలాన్నీ, హక్కుల కోణాన్నీ–బాలగోపాల్‌ని అర్థం చేస్కోవడంలో మన అభ్యుదయవాదులూ అక్కడే ఉన్నారు.

అందుకే, మొదటిసారి ముద్రించబడిన తరువాత మళ్ళీ, సుమారు శతాబ్దం తర్వాత కూడా ఈ వ్యాసం అవసరం మాకు కనిపిస్తోంది. ఇది చలం పుస్తకాల్లో ఏకైక ఆంగ్ల రచన. ఈ అనువాదంపై విమర్శలకు ఆహ్వానం.

# అంకితం

అణిచివేత సాధారణమయిపోయినచోట ఆత్మగౌరవం కోసం పోరాడ్డం అసాధారణంగానే చూడబడుతుంది. అసమానతలన్నీ కలిసి కుట్రపన్నినపుడు సమానతను కాంక్షించడం సాహసంగానే ఎంచబడుతుంది. అక్రమాలన్నీ ఒక్కటై హత్యలు చేస్తున్నప్పుడు అనుబంధాల్ని ప్రశ్నించుకోవడం తప్పనిసరవుతుంది. అన్యాయాలన్నీ నిర్బంధంగా చుట్టుముట్టినపుడు అనురాగాల్ని నిలదీయడం కూడా ఆత్మాభిమానమౌతుంది. వేటకుక్కలన్నీ ఏకమైనప్పుడు సైతం వెనకడుగు వేయకుండా వుండడమే తిరుగుబాటవుతుంది. త్యాగాల్ని చాతకానితనంగా చూసే పురుష ప్రపంచానికి చేవని పరిచయం చేస్తూ, మగ సమాజంలో దగా పడుతూనే మమతకీ – మానవతకీ ప్రాణం పోస్తూ నవీన వ్యవస్థ కోసం స్వేచ్ఛని గానం చేస్తున్న ఆడవాళ్ళకీ, వాళ్ళ ఆక్రందనలకీ, సిగ్గుపడుతూ...

# రచయిత

తెలుగులో పరిచయం అవసరంలేని ప్రఖ్యాత పేరు గుడిపాటి వెంకటాచలానిది (1894-1979). సాంప్రదాయ, ఛాందస సమాజంలోని భావదాస్యానికి వ్యతిరేకంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే ప్రధాన లక్ష్యంగా ఉద్యమ స్థాయిలో రచనలు చేసిన ఘనుడు. ఎన్నాళ్ళుగానో పాటించబడుతున్న అర్థంలేని ఆచార వ్యవహారాల్ని అక్షరాలతోనే ఏకిపారేసిన ఏకవ్యక్తి సైన్యం చలం. "స్త్రీకీ శరీరం ఉందనీ, దానికి వ్యాయామం కావాలనీ, ఆమెక్కూడా మెదడుందనీ, దానికి జ్ఞానం కావాలనీ, స్త్రీకీ హృదయం వుందనీ, దానికి అనుభవం అవసరమనీ "వంద సంవత్సరాల క్రితమే ఎలుగెత్తి చాటిన మహానుభావుడు చలం.

# అనువాదకుడు

గౌరవ్ నవీన భావాలుకల యువ రచయిత. ఆధునిక తాత్విక దృక్పథాన్ని దార్శనిక ప్రాతిపదికగా చేసుకుని అనేక రచనలు చేసాడు. విభిన్న దృక్కోణాలుగల వివిధ ప్రగతిశీల ఉద్యమాల్లో పాలుపంచుకునే ప్రయత్నం చేస్తూనే, భావవికాసోద్యమాల్లో అత్యధిక శాతంమందిని భాగస్వాముల్ని చేస్తూ, వ్యవస్థలో ఆలోచనాపరుల సంఖ్యను వీలైనంత పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నాడు. ఇదాయన మొట్టమొదటి అనువాద రచన.

# పురుషుడు-స్త్రీ

స్త్రీ పురుష బాంధవ్యాలకి సంబంధించిన వాతావరణమంతా సాధారణంగా పురుషహంకారంతోను స్త్రీ వినమ్రతతోను దుర్భరమవుతుంటుంది.

అజ్ఞానం, మూఢత్వం, పిరికితనం, జాత్యహంకారం, మతం, చట్టం, కీర్తి అన్ని స్వతంత్రాలోచనకి సంబంధించినవే. అయితే, కొందరు మాత్రమే సమర్ధవంతంగా ఈ దురభిమానాల నుండి, కీర్తికాంక్షల నుండి తమ మనసులను విముక్తి చేసుకోగలుగుతారు. తాము దేన్నయితే న్యాయమని భావిస్తారో, సత్యమని విశ్వసిస్తారో దానినే సమర్ధిస్తారు. ఎన్ని అవమానాలు మీదపడినా, ఎన్ని ఆరోపణలు ముంచుకొచ్చినా అంతిమంగా అంతరాత్మపైనే ఆధారపడతారు.

శతాబ్దాలుగా స్త్రీ స్వతంత్ర హక్కులు గల ఒక వ్యక్తిగా గుర్తించబడడం లేదు. ఆమె అస్తిత్వం ఆమె కొరకేనన్న అంశం విస్మరించబడి, ఆమె తమకేరకంగా ఉపయోగపడుతుందనేదే ప్రధాన విషయమయిపోయింది. అందుకే ప్రజలు ఆడవాళ్ళని మొక్కల్లాగా, పురుగుల్లాగా తప్ప మామూలు మనుషులుగా గుర్తించడం మానేసారు.

జీవించే హక్కుని వ్యతిరేకిస్తూ ప్రతీదానికి భౌతికమయిన పాదార్థిక విలువను అంటకట్టడం ఆత్మగౌరవాన్ని ప్రపంచం ముందు తాకట్టుపెట్టడానికేనన్నది స్పష్టం. ఒక దీపం దాని వెలుగును బట్టి, ఒక ఆవు అదిచ్చే పాలని బట్టి విలువ కట్టబడతాయి. అలాగే, ఆడది, ఆమిచ్చే సంతోషాన్ని బట్టి, చేసే సేవల్ని బట్టి, కనే పిల్లల్నిబట్టి విలువ కట్టబడుతుంది. అవితప్ప ఆమె జీవితానికి ఇక అర్ధం లేదు, కారణమూ లేదు. ఒకవేళ ఆమె తన భర్తకన్నా, పిల్లలకన్నా, ఇతరులకన్నా తన గురించే పట్టించుకుంటే గనుక అందరి దృష్టిలో అత్యంత హీనంగా చూడబడుతుంది. సామాజికంగా, నైతికంగా స్త్రీకి సంక్రమించిన అత్యంత పవిత్ర పుణ్యకార్యాలేవయినా ఉంటే, అవి అణుకువ, క్షమార్హత, సహనశీలత, సేవాతత్పరత మాత్రమే. ఇవన్నీ కూడా మగాడిని పొరబాటున కూడా ప్రశ్నించకుండా ఉండడానికీ, భర్త ఆగడాల్ని మౌనంగా భరించడానికి ఉద్దేశించబడినవే. రాత్రింబవళ్లు అతడ్ని సంతృప్తిపరుస్తూ, తన శరీరాన్ని, ఆత్మని అతడ్ని ఆనందపరచడం కోసమే వినియోగిస్తూ, అవి అపవిత్రం కాకుండా ఎల్లవేళలా కాపాడుకుంటూ పతిసేవలో మునిగితేలడమే స్త్రీ జీవిత పరమార్ధమని ఆమెని నమ్మించడమే ఈ పదాలకి గల ప్రయోజనం.

స్త్రీ ఎల్లప్పుడూ ఆమె అభిరుచుల్ని, ఇష్టాయిష్టాల్ని, ఆశనిరాశల్ని, లక్ష్యాలక్ష్యాల్ని, సుఖసౌకర్యాల్ని ఆఖరికి ఆత్మగౌరవాన్ని శీలంతోసహా పురుషుడికి సమర్పించుకోవలసి ఉంటుంది. ఈ క్రమాన్ని పాటించడం ద్వారానే స్త్రీ, స్త్రీగా చూడబడుతుంది. ఇందులో ఏ సత్కార్యాన్ని మినహాయించినా ఆడదానిగా ఆమె అనర్హురాలవుతుంది. ఈ విషయంలో, ఆమెపై జాలి చూపడానికి మనుషుల మాట అటుంచి దేవతలు సైతం ముందుకురారు. అయితే, ఇటువంటి త్యాగం నిస్వార్ధ ప్రేమ వలన తలెత్తింది కాదు. గొప్ప మానవత్వంలోంచి ఉత్పన్నమయింది ఇందులో ఏదీ లేదు. ప్రపంచం మొత్తం ఇతరుల దైనందిన అవసరాల్ని తీర్చడం ఆమె కర్తవ్యమని బోధించబట్టే ఇది జరుగుతోంది. మొగుడి ఆజ్ఞలు పాటించడం మొదలుకొని, పిల్లలు ఏడ్చినా, బంధువులు బాదినా, వ్యవస్థ బెదిరించినా స్త్రీ తన వ్యక్తిత్వాన్ని చంపుకుని తన అస్తిత్వానికి అవసరమయిన హీనమయిన పరిస్థితుల్లో బతుకీడుస్తోంది.

ఈ విషయంలో అసంఖ్యాక సందర్భాల్ని మన పురాణాలనిండా, మతం నిండా, చరిత్రలోనూ, దైనందిన జీవితంలోనూ పేర్కోవచ్చు. ఆడది కేవలం ఆడది మాత్రమే. తన భర్తని తృప్తిపరిచే, తన పిల్లల్ని పెంచే, తనున్న ఇల్లుని చక్కదిద్దుకునే ఆడది రోబో యంత్రం మాత్రమే. అంటే, ఆమె తనకి తాను ఏమీ కాదు. ఆమెకంటూ అసలు ఒక వ్యక్తిత్వం లేదు. ఒకరికి ఏదైనా ఇవ్వగలగాలంటే, ముందది మనం కలిగి వుండాలి. అయితే, **స్త్రీ ఈ భూప్రపంచంలోనున్న అన్ని జీవరాసుల్లోకెల్లా పెద్ద బానిస.** ఎందుకంటే, ఏవయితే ఆమె అర్పించుకుంటుందో వాటిని తిరిగి ఆమె ఆర్జించుకోలేదు. అందుకనే ఆమెని అత్యంత రుణగ్రస్తురాలిగా గ్రహించాలి. ఆమె రుణాల్ని, ప్రాపంచిక త్యాగాల్ని విలువ కట్టడానికి ప్రపంచంలో ఏదీ సరిపోదు.

ఇటువంటి సమయంలో ఆమె గురించి ఎవరయినా ధైర్యమూ, సాహసమూ, లక్ష్యమూ, ఆగ్రహమూ, వీరత్వమూ మొదలయిన పదబంధాల్ని ప్రయోగిస్తే ఎలా వుంటుందో ఊహించండి. అయితే, వీటి పక్కన ఆమెను చూడడానికి పురుష ప్రపంచం సిద్ధంగా లేదు. ఒక్కసారి స్త్రీ స్వతంత్రంగా తలెత్తి నిలబడితే తట్టుకునే చేవ మగమహారాజులకి ఉండదు. ఆమె కాయగూరలకి, చీరలు నగలకి తప్ప తన బుద్ధిని

దేనికయినా వినియోగిస్తే ధర్మనిష్టకై కంకణం కట్టుకున్న కొన్ని వందల వేల అదృశ్య హస్తాలు ఆమెని కలిసికట్టుగా అణగదొక్కుతాయి. స్త్రీ తన జ్ఞానాన్ని ఆవకాయ పెట్టడానికో, ఆభరణాల్ని ఎంపిక చేసుకోడానికో పరిమితం చేసుకోని పరిస్థితుల్లో సమాధుల్లోని పీనుగులు మొదలుకుని, సమాజంలో పుట్టబోయే పిండాలదాకా మొత్తం ప్రపంచం సాంప్రదాయాల్ని సంరక్షించడం కోసం ఆమెని నిర్దాక్షిణ్యంగా నిలువరిస్తుంది.

స్త్రీ స్వతహాగా బలహీనురాలనే తెలివయిన వాదనే పురుషుడికి బలమయిన అధికారాన్ని అందిస్తోంది. అదే ఆమెకు సంరక్షులు అవసరమనే భావనను బలపరుస్తోంది. స్త్రీ స్వీయ అసహాయతని ప్రకటించడం ద్వారానే పురుషుడు ఆమె పట్ల తన జులుం ప్రదర్శించగలుగుతున్నాడు. అంతరికంగా ఆమె తనతో సమానురాలనే నిజాన్ని ఎక్కడ అంగీకరించాల్సి వస్తుందోననే భయంతో, తానే ఆమెకు అసహజ భౌతిక బలహీనతల్ని, దుర్భేధ్యమయిన అజ్ఞానాన్ని, దైనందిన దాసత్వాన్ని అంటకడుతున్నాడు. అందుకే, అన్ని విధాలుగా, ఆమెని అబలగా ఉంచుతూ, శారీరక వ్యాయామాల్ని, మానసిక విజ్ఞానాన్ని ఆమెకు దూరం చేస్తున్నాడు. నైతిక శిక్షణకి దూరం చేయబడుతుందన్న అనుమానంతో స్త్రీ పరిపక్వత పొందకుండా నిరంతరం ఆమెకి కాపలా కాస్తున్నాడు. తన అధికారాన్ని అంతం చేస్తుందనే భయంతో ఆమెకు ఎరుక కలగకుండా అదుపు చేస్తున్నాడు. ఇటువంటి స్థితిలో స్త్రీని శాశ్వతంగా ఉంచేందుకుగాను ఘనత వహించిన సంఘసంస్కర్తలు రెండు మహత్తర విషయాల్ని ప్రతిపాదించారు. అవి బానిసత్వము, ఉదారత్వము.

## బానిసత్వము

స్త్రీ సహజంగా బలహీనురాలనీ, బుద్ధిహీనురాలనీ, సున్నిత మనస్కురాలనీ నిరుపయోగురాలనీ - ఆమెను నమ్మించాడు పురుషుడు. ఈ ప్రధానమయిన సుగుణాలన్నీ పురుషుడికి పుట్టుకతోటే సంక్రమిస్తాయని మభ్యపెట్టాడు. పురుషుడి అవసరం స్త్రీకి తప్పనిసరి అనే భ్రమను కల్పించాడు. స్త్రీ జీవితపర్యంతం పురుషుడి సరసన అతడికి లోబడి ఉండవలసిందేననే పరిస్థితి ఏర్పరిచాడు. ప్రజలు ఈనాటికీ స్త్రీ శారీరక బలహీనతల గురించి, ప్రకృతి సంబంధ సమస్యల గురించి, రోగగ్రస్తురాలవడం గురించి, బిడ్డకి జన్మనివ్వడం గురించి, నిష్ప్రయోజకత్వం గురించి, బహిరంగంగా మాట్లాడుతూనే ఉంటారు. పురుషుడికి అపవిత్రతను అంటించిన అనంత పాపిగా స్త్రీని భావిస్తారు. మగాడిని పాతాళంలోకి తోసేయడానికి జన్మించిన దురాత్మగా



ద్వేషిస్తారు. ఫలితంగా, అన్ని ముఖ్యమైన బాధ్యతల్నుంచి ఆమెని తప్పించి, మానసిక ధైర్యంతో, నైతిక బలంతో పనిలేని సాధారణ చాకిరీనంతా ఆమెకి అప్పగిస్తారు. స్త్రీ-తన సహజాత స్థాయిని అనుసరించి తన యజమాని కోసం ఒళ్ళొంచి కష్టపడే ఇంటిమనిషి, వంటమనిషి, పనిమనిషి మాత్రమే. ఇవికాక పురుషుడి లైంగిక కోరికలన్నింటినీ మౌనంగా సంతృప్తి పరిచే సాధనంగా స్త్రీని చూస్తారు. పురుషుడి దృష్టిలో స్త్రీ తన కోసం పిల్లల్ని కనే ఒక అందమయిన యంత్రం మాత్రమే. స్త్రీ అంటే సొంతంగా సాంఘిక, ఆర్థిక, ఆరోగ్య అంశాలన్నింటినీ పురుషుడికి వారసత్వాన్ని ఆస్తిని ప్రసాదించడం కోసం చంపుకునేదని అర్థం.

## ఉదారత్వము

ఈ సిద్ధాంతం ప్రకారం స్త్రీ చాలా ఉన్నతమయిన దేవతలాటి ప్రాణి. ప్రతీ విషయంలోనూ ఈమెకి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వవలసిందే. ఆమె ముగ్ధత్వం ఎదుట తలవొంచుతూ, ఎదురయిన ప్రతి సందర్భంలోను ఆమె మనోహరత్వానికి, లాలిత్యానికి సలాము చేస్తూ గులాము కావాల్సిందే. కవులు, ప్రేమికులు ఆమె సున్నితమయిన శరీరాన్ని గురించీ, సుమధురమయిన దాని నునుపుదనాన్ని గురించి గులాబి రేకులతో పోలుస్తారు. ఆమె నయనాలకి నక్షత్రాల తేజస్సుని, చంద్రుని చల్లని కాంతిని అద్దుతారు. అరచేతుల్ని కోమలంగానూ, పెదవుల్ని అమృత ధారలని బాగా అల్లుతారు. మెత్తంగా ఆమె నవ్వుని, నడకని, నడతని, వాక్కుని అన్నింటినీ కూడా అసాధారణంగా స్తుతిస్తూ పురుషుడు తన కళాత్మక శృంగార రసానికి ఒక పదార్థ ప్రతినిధిగా ఆమెను తయారుచేసాడు. పురుషుడి దృష్టిలో స్త్రీ సన్నంగా, సరసంగా, సంతోషంతో, తెచ్చిపెట్టుకున్న సిగ్గుతో, అర్ధనగ్నంగాకానీ, ఆర్భాటంగాకానీ ముస్తాబయి దాగుడుమూతలాడే ఒక ఖరీదైన ఆటబొమ్మ లేదా ఒక ఆకర్షణీయమయిన పుష్పం. ఎవరయితే ఆమెని కలిగి భద్రంగా ఉంచుకోగలరో వారు ఆమెని ఆనందంగా పొందగలరు. ఆమె చేతులు పనిచేస్తే రాటుదేల్తాయి. కాబట్టి పురుషుడే ఆమెకోసం పాటుపడతాడు. ఆమె కోమలమయిన నుదురు ఆలోచనల్తో ముడిపడడం చూడలేని పురుషుడు ఆమె సమస్యల్ని తానే ఆలోచించి అధ్యయనం చేసి పరిష్కరిస్తాడు. ఆమె స్వచ్ఛమయిన స్వభావం నైతిక సంఘర్షణల్ని ఎదుర్కోవడం సహించలేని పురుషుడు ఆమెని కాపాడే రక్షకుడి అవతారం ఎత్తుతాడు. రాజకీయాల్లో ఆమె కోసం తానే వోటేస్తాడు. ఆర్థిక రంగంలో ఆమెని తానే పాలిస్తాడు. సాంఘికంగా నియంత్రిస్తాడు,

నైతికంగా నిరోధిస్తాడు, చట్టపరంగా ఆమెని చట్రంలో బిగిస్తాడు. కళల్లోను, శాస్త్రాల్లోను ఆమెకోసం అన్నీ తానే సాధిస్తాడు.

సాధారణంగా ఇటువంటి కాల్పనిక ఉదారత్వం కవిత్వంలోను, సాహిత్యంలోను, పెళ్ళైన కొత్తలోను, ఇతరుల భార్యలు, కూతుళ్ళ పట్ల ప్రదర్శించబడుతుంది. ఒకే సమయంలో ఆడవారిని గురించి ఆకాశానికెత్తుతూ ప్రశంసించే పురుషులు మరుక్షణం ఆమెని అధఃపాతాళంలోనికి తొక్కడానికి ఏమాత్రం వెనుకాడరు. మామూలుగా మగాళ్ళు ముచ్చటించుకునే అందంలోను, కవిత్వంలోను, కాల్పనిక శృంగారంలోనూ తప్పకుండా తమ భార్యల్ని మినహాయించి తక్కిన స్త్రీలందరికీ స్థానం కల్పిస్తారు. వివాహానంతరం పురుషుడు తన నిజస్వరూపం బయటపెడతాడు. ఆలస్యం చేయకుండా తన అసలు రంగు ప్రదర్శిస్తాడు. క్రమంగా స్త్రీ కోమలమయిన అరచేతులు ఆచరణలో తోమడానికి, శుభ్రం చేయడానికి పనికొస్తాయి. అలాగే, సున్నితమయిన ఆమె మేధస్సు ఇల్లు చక్కదిద్దడానికి ఉపయోగపడుతుంది. ఈ విధంగా వక్రీకరించబడిన ఆమె భావి బానిసలకి శిక్షణ ఇవ్వడానికీ, తర్వాతి తరాన్ని కూడా పురుషుల అదుపులో పెట్టుకోడానికి వాడుకోబడుతుంది.

ఇవన్నీ కాక ఆమెని జగన్మాత అంటూ పూజించడం, లోకానికే తల్లివంటూ స్తుతించడం జరుగుతాయి. అయితే, పురుషుడి భక్తిశ్రద్ధలన్నీ స్త్రీని సామాజిక, కుటుంబ బానిసగా చేసుకుని తన సంతానానికి తల్లిని చేయడానికే కాని మరెందుకూ కాదు. ఇంట్లో పిల్లలకి కూడా తమ తల్లి స్థానం తేలిగ్గానే అర్థమవుతుంది. తమ తండ్రి ఆదేశాలకి విధేయతతో స్పందించే ఆమె పరాధీనతను గ్రహించడానికి పిల్లలకి అట్టేకాలం పట్టదు. తండ్రి తిట్ల పురాణాల నుంచి తప్పించుకుందుకు అమ్మపడే ఇబ్బందులు, హైరానా ఇంట్లో ఆమెకి గల హీనస్థానాన్ని అప్రయత్నంగానే పదిలపరుస్తాయి. అందుకు ఆమె పట్ల పిల్లలు కృతజ్ఞత చూపగలరేమోగానీ గౌరవనీయమయిన ఆర్ద్రత గల ప్రేమని, అభిమానాన్ని మాత్రం ఆమెకి అందించలేరు. పిల్లలు సరిగ్గానే ఆలోచిస్తారు. ఎందుకంటే, ప్రపంచంలోని ఎక్కువ మంది తల్లులంతా తమపట్ల జరిగిన దుర్మార్గాన్నంతటినీ జీర్ణించుకుని కూడా అనురాగాన్ని పంచగలవారే అయ్యుంటారు. తమని బాధించే వారిపట్ల, వేధించే వ్యక్తుల పట్ల ఒక రకమయిన గుడ్డి ఆత్మీయతని, పిచ్చిప్రేమని నిజాయితీగా కలిగివుండడం మాతృమూర్తులకి మాత్రమే సాధ్యం. అందుకే అయిదారు సంవత్సరాల బుడతడు కూడా తన తల్లిపట్ల అధికారాన్ని



ప్రకటించే హక్కు తనకున్నట్లు భావిస్తాడు. తనకి చేతనయిన అన్ని పద్ధతుల్లో అదే విషయాన్ని కచ్చితంగా ఆమెకి తెలపడానికి ప్రయత్నిస్తాడు. కుటుంబానికంతటికీ గొడ్డు చాకిరీ చేసినందుకు ఫలితంగా స్త్రీ సవాలక్ష సమస్యల్ని ఎదురుకుంటుంది. దారుణమయిన అవమానాలెన్నింటినో భరిస్తుంది. తన కడుపున పుట్టిన పిల్లలతో సహా తన సేవలు పొందుతున్న వారినుంచే హేళనలెన్నెదురయినా సహిస్తుంది. సేవాతత్పరత స్వతంత్రమయిన ప్రేమలోంచి ఉత్పన్నమయ్యేది మాత్రమే. కానీ, ఇక్కడ బిడ్డలకి కూడా తమ తల్లి పరాధీనత స్పష్టంగా అర్థమవుతుంది. ఆమెకంటూ నిలువనీడలేదనీ కాబట్టి ఎక్కడికీ వెళ్ళలేదని, ఆమెకు సంపాదించే శక్తి లేదని కాబట్టి వేరుగా బతకలేదని అర్థమవుతుంది. అందుకే, ఆమె తమ కోసం పనిచేస్తూ జీవించక తప్పదనే విషయాన్ని పిల్లలు గుర్తిస్తారు. ఆమెకి గల ప్రత్యామ్నాయ మార్గాలన్నీ సాంఘికంగా ఆమెని బహిష్కరించి పస్తు పెట్టడానికి పనికొచ్చేవేనన్న సంగతి గ్రహిస్తారు. ఒక పనివాడు తనకి సరిగా జీతమివ్వని పనిని వొదిలేసి మరోచోట ఉద్యోగం చూసుకోవచ్చు. కానీ స్త్రీ, వీరాధివీరుల్ని కన్న జగన్మాత జీవితాంత బానిస. పెళ్ళిరోజునే ఆమె తన దేహాన్ని – ఆత్మను అమ్మివేసుకుంది. ఈ బానిసనే లోకం జగన్మాతంటూ స్తుతిస్తుంది. ఎందరో పావన పురుషులకి జన్మనిచ్చిన ఈ జగన్మాతకి తన బిడ్డలపై కూడా కనీసం హక్కు లేదు. ఎంతో మంది పురుషులకి రొమ్ము పాలిచ్చి, స్వచ్ఛమయిన ప్రేమని పంచిన తల్లికి ఆమె సాకుతోంది తనపై అణిచివేతనేనన్న విషయం తెలీదు. ప్రకృతి తనకిచ్చిన పాలద్వారా అద్భుతమయిన శక్తిని, ప్రేమ ద్వారా అద్వితీయమయిన వ్యక్తిత్వాన్ని ఆ మాతృమూర్తి బిడ్డకందిస్తుంది. ఇదంతా బిడ్డపై అదుపులేని తల్లి సహజ పిచ్చిప్రేమ వలనే జరుగుతుంది. ఆమెంత అమాయకురాలంటే, తన బిడ్డ ఎదిగి, బిడ్డకి తన ప్రేమ అక్కరలేనప్పుడు సైతం ప్రేమిస్తూనే ఉంటుంది. అదే ప్రేమను పిల్లల నుంచి ఆ పిచ్చితల్లి ఆశిస్తుంది. తల్లి ఆ బిడ్డని ఎంత తీవ్రంగా ప్రేమిస్తుందంటే, ఆమె అంతర్గతంగా ఆ బిడ్డతోపాటే జీవిస్తుంది. బిడ్డ ఎదుగుదలకి మురిసిపోతూ, అతడి అసంకల్పిత జ్ఞానార్జనని, అనుభవాల్ని తన మదిలో పదిలపరుచుకుంటూ ఆ క్రమంలో తనకంటూ ఒక అస్తిత్వముందనే విషయాన్నే మర్చిపోతుంది. పరిపూర్ణంగా ఎదిగిన బిడ్డ తనదైన సొంత ప్రపంచంలోకి ప్రవేశించగానే ఆ తల్లి పరాయిదైపోతుంది. తన సంతానం లింగభేదం కారణంగా తన సాంగత్యాన్ని నిరాకరిస్తోందన్న నిజం తెల్సుకుంటూనే నిస్తేజమయిపోతుంది. తాను మలిచిన బిడ్డతో తల్లి తాను లేని లోకాన్ని

ఊహించుకోలేదు. తాను చేసిన మనిషి తనకే దూరమయితే ఊరుకోలేదు. దగ్గరవ్వడానికి ప్రయత్నం చేస్తుంది. కాని, బిడ్డ ఆమెనొక అడ్డుగా భావిస్తాడు. అభివృద్ధికి ఆటంకమనుకుంటాడు. అభిమానాన్ని బరువుగా భావిస్తాడు. ఆమెతో స్నేహంగా మసలడం చిన్నతనమనుకుంటాడు. ఆమె నిస్వార్థ ప్రేమపై పదునయిన వాడికల ఆయుధంతో దాడి చేస్తాడు. ఆమె త్యాగానికి ద్రోహం చేస్తాడు. ప్రస్తుత పరిస్థితుల్లో స్త్రీకి భార్యగా, తల్లిగా ఇదొక తప్పనిసరి పరిణామం. మానవాళి స్వార్థం కోసం బాధించబడే స్త్రీకి దాన్ని గుర్తించకుండా ఉండడం కోసమే మాతృత్వమనే ఒక మమకారం గల బహుమతిని ఎరగా వేసిందేమో.

చట్టం ఎన్ని మార్పులకు చేర్పులకు లోనయినా స్త్రీ విషయంలోమట్టుకు స్థిరంగా ఉంటుంది. స్త్రీని పురుషుడి ఆస్తిగా అన్ని కాలాల్లో, అన్ని దేశాల్లో గుర్తిస్తున్నారు. అభివృద్ధి చెందిన ఆధునిక రాజ్యాలు సైతం మరొకరి దేహాన్ని – ఆత్మని ఒకరి సొత్తుగా భావించడాన్ని మనస్ఫూర్తిగా అసహ్యించుకోవడం లేదు. ఒక వివాహిత శరీరం ఆమెదెంతమాత్రం కాదు. ఆమెకి రోత కలిగించినప్పటికీ ఆమె భర్తకి ఏ మాత్రం కనికరం లేకుండా ఆమెని ఈడ్చుకెళ్ళి బలవంతంగా తన కోరిక తీర్చుకొనే హక్కు ఉంది. స్త్రీ తన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా భర్తని తృప్తిపరచాల్సిందే. అందుకు అంగీకరించని స్త్రీని చూస్తే ఈ ప్రపంచానికి కంపరం పుడుతుంది. ప్రజలంతా తలోకరాయి ఆమెపై వేసి తమ ప్రేతాత్మలని సంతృప్తి పరచుకుంటారు. స్త్రీ ఆమెంత అపరిపక్వత కలదైనా, వివేకవంతురాలయినా, భర్తతో నైతిక వ్యభిచారానికి సంసిద్ధురాలు కావలసిందే. భర్త బలాత్కారాన్ని ఛీత్కారంతో మౌనంగా అంగీకరించవలసిందే. పురుషుడి లైంగికేచ్ఛకి స్త్రీ శారీరక, మానసిక పరిపక్వతతో బొత్తిగా సంబంధం లేదు. అందుకే భర్తల ఆక్షేపణలకి గురయ్యి ప్రాణాలపైకి తెచ్చుకున్న కన్నీటిగాధలకి భారతదేశంలో కొదవే లేదు. అలాంటి నిర్భాగ్యులు నిరంతరం ఎక్కడోచోట తటస్థపడుతూనే ఉంటారు.

వారసత్వ ఆస్తి సంబంధ చట్టాలు పాక్షికమయినవిగా ఉంటూ స్త్రీని బాధిస్తున్నాయి. తాను కనిపెంచిన పిల్లలపై తల్లికి హక్కు ఉండదు. చాలా దేశాల్లో వైవాహిక బంధాన్ని రద్దుచేసుకునే హక్కు స్త్రీకి లేదు. సరికదా ఆమె తనకి కనుక విడాకులు కావాలనుకుంటే అతి దారుణమయిన చెప్పనలవికాని అణిచివేతల్ని, అపవాదుల్ని ఎదిరించి నిలవాల్సి ఉంటుంది. చట్టం పురుషుడు, పురుషుడి కోసం ఏర్పర్చుకుంది మాత్రమే.

ప్రపంచంలోని అన్ని ఆర్థిక వనరుల్లోనూ స్త్రీ మాత్రమే ఎందుకూ పనికిరానిది, వృధా అయినది. పురుషుల్లాగానే స్త్రీలలో కూడా మూడు తరగతులకి చెందిన



వారుంటారు. ధనవంతులు, మధ్యతరగతి స్త్రీలు, పేదలు. స్థితిమంతుల భార్యలు చేయదగింది ఏదైనా ఉంటే, అది పర్యవేక్షించడం ఒక్కటే. గలగలా మాట్లాడుతూ ఆడంబరంగా వుండే వీరు గాజుబొమ్మల్లా సంరక్షించబడుతుంటారు. ఇక మధ్యతరగతి స్త్రీలు స్వచ్ఛమయిన కుటుంబ బానిసలు. ఇతర విషయాలపట్ల దృష్టి నిలపడానికి వీరికొక్క క్షణం కూడా తీరికుండదు. ఈ రెండు తరగతుల స్త్రీలు ఆర్థికంగా బిచ్చగత్తెలే. ఎందుకంటే వీరు సొంతంగా ఒక పైసా కూడా సంపాదించలేరు. ఇక పేదస్త్రీ విషయానికొస్తే, ఈమె తను సంపాదించింది సర్వం కుటుంబానికే ధారపోస్తుంది. అయితే ఈమె కష్టపడి ఆర్జించిన వేతనం కూడా భర్త ఆస్తిలో భాగంగానే ఎంచబడుతుంది. అందుకే, స్త్రీ తన వేతనంపై అతనికి ఆధిపత్యాన్ని కల్పిస్తోంది. కాబట్టి, జీతానికి పనిచేసే స్త్రీ కూడా ఆర్థికంగా స్థిరపడిందని చెప్పే వీలు లేదు. ఈ పరిస్థితిని ఎదిరించి నిలిచిన అతికొద్దిమంది యూరపు నారీమణులు మినహాయించి ప్రపంచ ఆర్థికోత్పత్తికి సంబంధించి తిరుగుబాటు ద్వారా ప్రాధాన్యత సంతరించుకున్న స్త్రీలెవరూ లేరు. ప్రపంచ జనాభాలో సగం మంది స్త్రీలు మిగిలిన సగం ఉన్న పురుషులకి అడ్డమయిన చాకిరీ చేయడానికే వినియోగించబడ్డమంత ఘోరం మరోటి లేదు. ఇంటిపని చేయడం ద్వారా స్త్రీలు, పురుషులకి ప్రాపంచికమయిన ఉద్యోగాలు చేసే వీలు కల్పిస్తున్నారు. కానీ, ఒక స్త్రీ కొద్దిమంది పిల్లల్నే చూసుకోగలదు. అదే విధంగా ఒక పురుషుడు కానీ స్త్రీ కాని సుమారు యాభైమందికి వండివార్చగలరు. నిపుణులైన పనివారు ఇదే పని అనుకూలమయిన పద్ధతుల్ని అనుసరిస్తూ మరింత సౌకర్యవంతంగా, వేగవంతంగా, సరసంగా చేయగలుగుతారు.

సాధారణంగా మేధోవంతంగా న్యూనత భావం కల పురుషులే శారీరక శ్రమ చేసేందుకు ముందుకు రావడం జరుగుతోంది. ఒకవేళ ఇదే పద్ధతిని క్రమబద్ధం చేసినట్లయితే మేధోపరమయిన శ్రమకు సరిపడని స్త్రీ పురుషులంతా ఇతర చాకిరీ పనుల్ని, వంటపనుల్ని ఎంచుకునే వీలు కలుగుతుంది. మిగిలిన స్త్రీ పురుషుల మేధస్సు అత్యధిక శాతం ప్రజాసంక్షేమానికే వినియోగించబడతాయి. ఒక స్త్రీ కుటుంబం మొత్తానికి సేవ చేయాలనే సంప్రదాయం కనుమరుగయి, ప్రజా సంబంధపనివారు, వంటవారు మానవాళి అవసరాలు తీర్చడం కోసమే శాస్త్రీయంగా తయారుచేయ బడతారు.

మరో విషయమేమిటంటే, స్త్రీ కేవలం బిడ్డల్ని కనిపోషించే యంత్రంగా భావించబడుతూ, ఇంటి విషయాలకే పరిమితమయ్యే విధంగా హద్దుల్లో ఉంచ

బడుతోంది. అయితే శ్రామిక స్త్రీలు రోజుకి 6 నుంచి 12 గంటలు పనిచేస్తుండగా, వారిచేత ఉపేక్షించబడిన పిల్లలు, డబ్బాపాల ధనవంతుల బిడ్డలకన్నా ఎక్కువ ఆరోగ్యకరంగానూ, ఉత్సాహంగానూ ఉంటారు. అత్యధిక శాతం మంది స్త్రీలు పాశ్చాత్య దేశాల్లో దేవుడు చేసిన కన్యలుగా కాలం వెళ్ళదీస్తుంటే, భారతదేశంలో స్త్రీలు దేవుడు చేసిన విధవలుగా ఉంటున్నారు. చాలామంది వివాహితలు గొడ్రాళ్ళుగాను, కొందరు ఎదిగిన బిడ్డల తల్లులుగాను ఉన్నారు. వీళ్ళు పని చేయగలరు. చిన్న వయసులో తల్లులయిన స్త్రీలు సైతం బిడ్డల్ని కని, పెంచి పోషించే కాలాన్ని మినహాయించుకుంటే కావలసినంత కాలం ఇంకా వారు స్వతంత్రంగా తమకి నచ్చిన పనిచేసుకోడానికి గాను మిగిలి ఉంటుంది. ఒకవేళ స్త్రీ స్వతంత్రంగా ఆర్జించుకోడానికి అనేక కారణాల వల్ల అవాంతరాలు ఏర్పడితే, లేదా అనివార్య కారణాల వల్ల వీలు కాకపోతే ప్రభుత్వమే ఆమెకు గౌరవ వేతనం ఏర్పాటు చేస్తూ శాసనం చేస్తే మంచిది.

ఏ స్త్రీ కూడా పుట్టుకతోనే తల్లి కాలేదు. అలాగే సేవకురాలిగా, శిక్షకురాలిగా, కళాకారిణిగా, న్యాయవాదిగా జన్మించలేదు. పిన్న వయసులో తల్లులైనవారి పిల్లలెవరూ సరయిన శారీరక పోషణని, మానసిక శిక్షణని ఆమెనుంచి పొందలేరు. ఇరువురూ ఇబ్బంది పడ్తారు. ఒక వ్యక్తి జన్మించిన రెండు సంవత్సరాల్లో రూపుదిద్దుకునే వ్యక్తిత్వమే ఆ వ్యక్తి జీవితాంతం ప్రభావం చూపుతుందని ప్రతిపాదించబడింది. కాబట్టి పిన్న వయసు తల్లుల తలపై గర్భమనే భారం మోపి, బిడ్డల్ని సాకమనడం చాలా ప్రమాదకరం. ఇతర జీవుల్లాగా బిడ్డల్ని బలవంతంగా స్త్రీలచేత కనిపించడం హానికరం. పక్వత పొందని తల్లి దగ్గర పెరిగిన పిల్లల పరిణితి బొత్తిగా ఎదగదనేది యదార్థం. ఒక తెలివయిన విధానమేమిటంటే, రోజు మొత్తానికి ఇటువంటి పిల్లల్ని చూసుకునేలా ఒక స్త్రీని నియమించుకుని, తిరిగి పనిలోంచి సాయంత్రం ఇంటికి రాగానే తల్లులు తమ బిడ్డల్ని తీస్కోటం. అప్పుడే జన్మించిన బిడ్డ తల్లికి అదనపు భారం కాకుండా ఉండాలంటే ఈ రకమయిన ఏర్పాటు పనికొస్తుంది. ప్రకృతిలో ఇతర ఏ ఆడజంతువు కూడా కానుపు కారణంగా ఆహారం సంపాదించుకుందుకు ఆటంకపరచబడదు. అయితే స్త్రీ విషయంలో ఆమె స్వేచ్ఛని హరిస్తూ, ఆమెకి గల సహజమయిన లైంగికోత్పత్తి భావాల్ని కట్టడి చేయడానికే ఈ ఏర్పాటు చేయబడింది. స్త్రీ గర్భధారణని **వైకల్యం**గా భావించాల్సి వస్తే అందులో సగం బాధ్యత పురుషుడికుందనే సామాన్య విషయాన్ని గుర్తుంచుకోవాలి. అటువంటప్పుడు ఆమె పడే బాధలో అర్ధశాతం అతడూ పంచుకోవాలి. అలా కానప్పుడు, పిల్లల్ని కనడమనేది తనకే విధంగా ప్రయోజనకరమో



గుర్తిస్తూ, గర్భాధారణ వల్ల తను పొందే ప్రత్యేక ఉపయోగాలేవీ లేవని స్త్రీ గ్రహించాలి. తన జీవితాన్ని సంపూర్ణంగా పురుషుడి సేవకే అంకితం చేసుకున్నందువలన ఒరిగేది బాధాకరమయిన కానుపు మాత్రమే. అయితే, దానికి విరుద్ధంగా తనని వాడుకుంటున్న దేవుడి మీదా, మగాడి మీద ఆమె తిరుగుబాటు చేయడం తప్పనిసరి. వివేకవంతమయిన ఏ స్త్రీ కూడా బిడ్డల పెంపకంలో తనతో భాగం పంచుకుందుకు ముందుకురాని పురుషుడి కోసం బిడ్డల్ని కనేందుకు సిద్ధపడదు.

అదే పురుషుడు తెలివితేటలుండి దేశ నాయకుడిగానో, పరిశోధక పట్టభద్రుడిగానో ఎదగలేక వడ్రంగిగానో, రోడ్డు కూలిగానో కుదిరితే అతడి అసమర్ధతని పరిగణనలోకి తీసుకోని ఈ ప్రపంచం, ఇదే భూగోళంలో పురుషుడితో సమానమయిన స్త్రీలంతా పుట్టుకతోనే వంటావార్పులకి, ఇంటిసేవలకి, పెంటపోగులకి అతికించబడుతున్నారనే సంగతి మాత్రం చచ్చినా పట్టించుకోదు. స్త్రీ ఒక పునరుత్పత్తి కారకంగానే చూడబడుతోందనే వాస్తవం గుర్తుంచుకోదు. ఎందువలన స్త్రీ శాస్త్రజ్ఞులు, కవయిత్రిలు, నాయకురాళ్ళు తరతరాలుగా అవకాశాల్ని పోగొట్టుకుంటున్నారన్నది ప్రశ్నార్ధకం. ఒక స్త్రీ ఆమె స్వభావరీత్యా మంచి కళాకారిణి కావచ్చు. విజ్ఞానంతో శాస్త్ర పరిశోధకురాలు అవ్వొచ్చు. మేధావిగా నూతన ఆవిష్కరణలు చెయ్యొచ్చు. తన సంగీత ప్రతిభతో గొప్ప విద్వాంసురాలుగా మారొచ్చు. అయితే ఆమె అన్ని ప్రదేశాల్లో ఒక్కలాగే చూడబడుతోంది. వంటింట్లోను, తోటలోను, పడకగదిలోను స్త్రీ వలన సాధ్యమయ్యే కార్యాలున్నాయని అనుకోవడం అనూహ్యమయిపోయింది. అనేక రకాల రహస్య మానసిక సంఘర్షణలు, దీర్ఘకాలికమయిన మనోవేదనలు, అచేతనావస్థలో ఆవిర్భవించే స్వప్నాలు ఈ స్త్రీమూర్తుల్ని నియంత్రిస్తున్నాయో ఎవరూ పట్టించుకోరు. మరొకరు స్త్రీ మానసిక ఆశల్ని అవగతం చేసుకునేలోగానే నిర్దాక్షిణ్యంగా బలవంతంగా ఆమె ఆలోచనలు నాశనం చేయబడతాయి. కనీసమయిన కనికరం లేకుండా అణగదొక్కబడతాయి. మనిషి మస్తిష్కంలో స్త్రీపురుష జాతిభేదాల్ని నిర్దేశించే ప్రత్యేక అవయవమేదీ లేదు. స్త్రీ మెదడు పురుషుడికంటే భిన్నమయినదేమీ కాదు. ఇతర ఏ వృత్తిలో, ఉద్యోగంలోనైనా కూడా ఆర్ధికపరమయిన అంశాలలో స్త్రీకి అవమానకరమయిన భాగం అట్టేపెట్ట బడుతుంది. అందుకే తమకంటూ సంపాదించుకోలేని భార్యలు, తమ సంపాదనలపై నియంత్రణలేని భార్యలు శుద్ధమయిన పరాన్నజీవులుగా పరిగణింపబడుతున్నారు.

స్త్రీ జీవితాంత దాస్యానికిగాను పురుషుడే ఆమె ఖర్చులు చెల్లిస్తాడు. స్త్రీ ఏం తినాలో ఏం తొడగాలో పురుషుడే నిర్ణయిస్తాడు. ఆభరణాల సంగతలావుంచితే

మూడొచ్చినప్పుడు ముద్దులు, తిక్కెక్కితే తన్నులూ భర్త నుంచి స్త్రీకి ఉచితంగానే లభిస్తాయి. ఇక ఆమెకి సౌకర్యవంతమయిన వసతిని కల్పించినందుకుగాను స్త్రీ తన శరీరాన్ని అతడికి సమర్పించుకుంటుంది. సుఖదుఃఖాల్లో చివరివరకూ అతనికి సేవలు చేస్తూ విశ్వాసంగా పడుంటుంది. ఆ తర్వాత కూడా తమ భార్యల్ని, తమను సేవించే బానిసల్ని వదులుకోవడం సుతారమూ నచ్చని కొందరు ఆదర్శభర్తలు పరలోకంలో కూడా పడక సుఖాల్ని కోరుకుంటారు. జన్మజన్మలకి ఈమే తమ భార్య కావాలని కోరుకుంటారు. అయితే, ఒకసారి తనతో శారీరక సుఖం పంచుకున్న పురుషుడు, తన భర్త, తనని నిరాకరించినప్పుడు ఆ స్త్రీ బాధ, పడే వేదన వర్ణనాతీతం. పైగా ఒక్కసారి పురుషుడిచేత తాకబడిన స్త్రీని కలుషితమైపోయినదిగా చూడబడే ఈ నైతికోన్మాద సంఘంలో దౌర్జన్యాలకు గురైన స్త్రీ బాధ చెప్పనలవి కాదు.

ఆర్థిక కోణంలో పరిశీలిస్తే వేశ్యలు మాత్రమే స్త్రీలలోకెల్లా గర్వించదగిన గౌరవాన్ని కలిగి ఉండగలరు. తనను తాను నిజాయితీగా సమర్పించుకుని సంపాదించుకునే స్వతంత్రాన్ని ఆమె కలిగి ఉంటుంది. తనకి నచ్చిన విటుడ్ని అనుమతించే అధికారం ఆమెకుంటుంది. ఇవన్నీ కాకుండా, ఆమె ఆర్జించిన దానిపై ఆమెకు హక్కుంటుంది. తమ మొగుళ్ళకి అంకితమయిన స్త్రీల దయనీయ స్థితికంటే ఇది మెరుగే. ఒకరి తిండి, బట్ట మొదలయిన కనీసావసరాలకై మరొకరిపై జీవితాంతం ఆధారపడ్డం కంటే నీచమయినది ఈ ప్రపంచంలో మరోటి ఉందంటారా? వివాహబంధాన్ని విషపురుగులా కొంచెం కొంచెం విచ్ఛిన్నం చేసేది ఈ సమస్యే. స్త్రీలోని ఆత్మగౌరవాన్ని, ఆంతరిక స్వేచ్ఛను ఇది చంపేస్తుంది. అందంగా, ధైర్యంగా, సాహసంగా ఉండాల్సిన స్త్రీ కురూపి అయిన బానిసలాగా, సిగ్గులేని నాకుడు కుక్కలాగా తన యజమాని పాదాల వద్ద పడి అతడు ఎంతగా అలక్ష్యం చేస్తున్నా అతడ్నే అంటిపెట్టుకునుండే దానిగా స్త్రీ ప్రేమపేరుతో జరిగే సంతలో చాలా తక్కువగా చవకగా అమ్ముడుబోతోంది. స్త్రీకి స్వతంత్ర స్థాయిలేదు. సమాజంలో ఆమె తన భర్త పేరుతో చలామణీ కావల్సుంటుంది. అడుగడుగునా మొగుడి నామాన్ని స్మరిస్తూ స్త్రీ తన అస్తిత్వాన్ని నిలుపుకోవాల్సుంటుంది. ఒక యువరాణి వంటవాడ్ని మనువాడితే ఆమె కూడా వంటమనిషే, అలాగే ఒక ఊడ్చేవాడి కూతురు మహారాజుని మనువాడితే ఆమె మహారాణి. జీవనాధారం కోసం, తన జీవితాన్ని రక్షించుకోవడం కోసం, గౌరవం కోసం స్త్రీ తప్పనిసరిగా తన భర్తమీదనో, తల్లితండ్రుల మీదనో ఆధారపడి బతుకీడుస్తూ, తన సహజమయిన అభిరుచుల్ని, అభిప్రాయాల్ని చేజేతులా చంపుకుంటుంది. ఏమాత్రం పసలేని ఒక వేశ్యలా తనని తాను వివాహం పేరుతో విక్రయించుకుంటోంది. ఒక్కసారి మగాడి చేతిలో చిక్కిన ఆడదానికి పెళ్ళనే పంజరం శాశ్వత బంధీఖానాగా మారి



అందమయిన ఇంద్రజాలంతో మోసపుచ్చుతుంది. వివాహానంతరం స్త్రీకి సంబంధించిన సంగతులన్నీ భర్త ఆసక్తిపై ఆధారపడి సర్దుకోగలుగుతాయి. పురుషుడిలోని పశుత్వానికి, శరీర వాంఛలకు అనుగుణంగా స్త్రీ తన దేహాన్ని ఉంచుకోవాలి. బుద్ధిలేని అతడి తార్పుడు బూతుల్ని బుర్రాడిస్తూ ఆస్వాదించాలి. తన ఆనందంతో సంబంధం లేకుండా అతడ్ని అనుక్షణం ఆరాధించాలి. పనికిమాలిన మగాడి తెలివితేటల్ని పరమగొప్పగా పొగుడుతూ ఉప్పొంగించాలి. భర్త సుత్తి మేధస్సుని నిరంతరం స్తుతిస్తుండాలి. అతడ్ని సంతోషపెట్టడం కోసం అన్ని దిక్కుమాలిన దారులూ ఆమె తొక్కాలి. అతడ్ని సుఖపెట్టడం కోసం అన్ని దివాళాకోరు మార్గాలను అన్వేషించాలి. చివరకు అనివార్యమయిన బానిసగా అతడికి కావలసినంత మంది పిల్లలకి తల్లి కావాలి. ఈ పద్ధతంతా కమ్మని పదాలతో, తియ్యటి వాక్యాలతో పెళ్ళి పేరుతో, నూరేళ్ల పంట పేరుతో, పవిత్రబంధం పేరుతో, అన్యోన్య దాంపత్యం పేరుతో, చిలకాగోరింకల జంట పేరుతో సమర్ధించబడుతుంటుంది. వివాహం పేరుతో జరిగే ఈ వికృత వ్యభిచారం స్త్రీచేత అచేతనంగానే ఆమోదించ బడుతుంది. అత్యున్నత కులీన స్త్రీలు కూడా దీనికి మినహాయింపు కాదు. అసలీ ఆలుమగల అనుబంధంలోనే ఒక ద్రోహపూరితమయిన దృష్టి వుంది. తొలగించడానికి సాధ్యం కాని ఒక నీచత్వం నిబిడీకృతమై ఉంది. అందుకే అత్యున్నత స్థాయిలో ఉండే భర్తలు సైతం డబ్బుకి, తిండికీ, గుడ్డకీ తనపై ఆధారపడే భార్యని తనతో సమాన హోదా కల్పించడం అగౌరవంగా, అవమానంగా భావిస్తారు. పాపం చాలామంది భర్తలు తమకు తెలీకుండానే ఈ క్రమాన్ని కొనసాగిస్తారు. ఎందుకంటే వారు ఈసరికే తమని బానిస యజమానులుగా మలుచుకోవడానికి అలవాటు పడిపోయారు కనుక.

కానీ, స్త్రీ కూడా పురుషుడిపై ఆధారపడి ఉండేందుకు ఇష్టపడుతోంది. ఆత్మవిశ్వాసమనే ఆలోచనే ఆమెకు నచ్చట్లేదు. శతాబ్దాల పరాధీనత స్త్రీకి అబలనే బిరుదుని ప్రసాదించింది. అందుకనే సొంతకాళ్ళపై నిలబడ్డమంటేనే ఆమె జంకుతోంది. జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకుల కంటే కూడా మొగుడి తన్నులే ఆమెకు అనుభవించదగినవిగా తోస్తున్నాయి. బతుకుపోరులో వచ్చే బాధల కన్నా భర్త బాదుడే ఆమెకు భరించదగ్గదిగా ఉంటోంది. పెళ్ళి పేరుతో చవకగా దొరికే యజమాని పెంపుడు జంతువులా తనని సాకుతుండగా, సాధారణంగానే ప్రాపంచిక బాధ్యతల్ని తీసుకోడానికి స్త్రీ ముందుకు రావడం లేదు. ఈ విధంగా పురుషుడి చేతిలోపడి కృశించిపోయిన స్త్రీ తనకు తానే అదుపు చేయబడడానికి సిద్ధమయినట్లు ప్రపంచానికి ప్రకటిస్తోంది.

ఒకసారి యవ్వనంలో భార్య ఇంట్లో అడుగుపెట్టాక భర్తే ఆమె అభిరుచుల్ని నిర్ణయిస్తాడు. ఆమె మనస్తత్వాన్ని నియంత్రిస్తాడు. ఆమె ఆలోచనల్ని రూపొందిస్తాడు.

ఆమె కోరికల్ని కట్టడి చేస్తాడు. అతడి అభీష్టానికి అనుగుణంగానే ఆమె తన పుస్తకాల్ని – ఇతర స్నేహితుల్ని (స్త్రీ స్నేహితులు మాత్రమే), ఇంటి పనుల్ని చక్కబెట్టాల్సి ఉంటుంది. తనకంటూ సొంత మనస్తత్వం గల మహిళగా మరణించిన స్త్రీ భార్యగా పరకాయ ప్రవేశంచేసి మొగుడికి నీడలా మారి చిలక పలుకుల్ని వల్లిస్తూ గ్రామఫోను రికార్డులా గలగలా మాట్లాడాల్సి వస్తుంది. స్వతంత్ర జ్ఞానార్జనను ఆకాంక్షించాల్సిన స్త్రీ తన విశాల దృక్పధాన్ని వినాశనం కావించుకుని భర్త వికారాలకి పరిమితమయి తనని తాను వినిర్మాణం చేసుకుంటోంది. ఈ క్రమం అచేతనావస్థలో నేరమారోపించ బడిన మరణంగా పేర్కొంటే, చేతనావస్థలో క్రూరంగా చేయబడిన హత్యకి ఏ మాత్రం తీసిపోదనే అర్థం. ఖూనీకోరు శరీరాన్ని మాత్రమే హత్య చేస్తాడు. కానీ భర్త స్త్రీ ఆత్మని తినేస్తాడు. ఈ నేరం మతం పేరుతో వివాహం పేరుతో ముద్దు ముద్దు పిలుపులతో, దాంపత్యం పేరుతో, ప్రేమపేరుతో అంతరాత్మల ఐక్యత పేరుతో చేయబడుతుంది. నిర్ధారించబడినట్లుగా నిర్దాక్షిణీయంగా స్త్రీల గొంతు కోయబడుతోంది. స్వేచ్ఛాలోచన, స్వతంత్ర భావన అనేవి దాంపత్య నేరాలుగా స్త్రీల విషయంలో భావించబడుతున్నాయి. పురుషుడు తన పురుషత్వాన్ని సౌకర్యవంతంగా మలుచుకోవడం కోసం సిసలయిన స్త్రీత్వాన్ని హత్య కావిస్తున్నాడు. స్త్రీ మనసుని చంపగా మిగిలిన పార్ధివ ప్రేత విగ్రహంతో కలసి బతకడానికే ఇష్టపడుతున్నాడు. తొణికిసలాడుతున్న రక్తవర్ణంతో సంతోషంగా ఉంటూ తమ సామర్థ్యంతో జీవించాల్సిన ఎంతోమంది యువతులు, చైతన్యరహితంగా శిధిలావస్థకి చేరువగా గుర్తుపట్టడానికి వీలులేని ఆకారాల్లో కనిపిస్తూ విధేయత కల భార్యలుగా గడుపుతుండడం చూడవచ్చు. భర్త ప్రపంచంలోకి ప్రవేశించి అన్ని అంశాల్ని గ్రహించినవాడై ఉంటాడు. అనుభవజ్ఞానాన్ని ఆర్జించిన వాడైఉంటాడు. పురుషుడికి తన మిత్రులు, పుస్తకాలు, వ్యాపకాలు, తల్లితండ్రులు, లోకానుభవం ఇతరాలన్నీ ఉంటాయి. వేదాంతంలో చెప్పిన సర్వజ్ఞుడిలా తన సృష్టిని అతడు నడిపించగలడు. అదే సమయంలో, భార్య ఇంటికి మాత్రమే పరిమితమయిన తన అల్పమయిన అనుభవాన్ని ఆధారం చేసుకుని దాన్ని విస్తరించుకోవడం కోసం భర్తపై ఆధారపడుతుంది. తన పతిదేవుడు బుద్ధిహీనుడయితే ఆమె కూడా బుద్ధిహీనురాలవుతుంది; అతడు దుర్మార్గుడయితే అతడ్ని అనివార్యంగా అనుసరిస్తున్నట్లు ఆమె ప్రవర్తిస్తుంటుంది. అయితే నిజమయిన బుద్ధిహీనులుగా – దుర్మార్గులుగా ఉంటున్నవారికి అనుకరణగా, రెండోరకం సరుకులుగా మెలగడం కంటే అసహ్యకరమైంది మరోటి లేదు. దీని పర్యవసానమే స్త్రీ పరాధీనతతో కూడిన విధేయత. దీని ఫలితమే స్త్రీ ఆత్మత్యాగము, దేహత్యాగమూను. అయితే, కాలక్రమంలో పురుషుడు తానే సృజించిన ఈ అనుసరణలకి విసుగు చెందుతాడు. తన



ఆంతరికల్పత్వాన్ని స్పష్టంగా భరించే శక్తిని ఎప్పుడయితే భర్త కోల్పోతాడో, అప్పట్నుంచి కొత్త సంతోషాల్ని అన్వేషించడం ఆరంభిస్తాడు. స్త్రీగా ఆమె మనసుని, వ్యక్తిత్వాన్ని సమూలంగా నిర్మూలించి ఆమె విగ్రహానికి అలంకారాలు చేసుకుని తృప్తిపడే భర్త, భార్య అనే బిరుదుని తానే ఆమెకు ప్రదానం చేసి స్త్రీగా చనిపోయిన శవంతో, జీవంలేని దేహంతో తన శారీరక, మానసిక కోరికల్ని తీర్చుకుంటాడు. స్వచ్ఛమయిన మానసిక ఆదరణతోను, పరిపూర్ణమయిన ప్రేమపూర్వక భక్తిభావంతోనూ తనని సేవిస్తున్న భార్యని తన మెడకి చుట్టుకున్న చిరాకుగా పరిగణిస్తాడు. ఈ క్రమంలో స్త్రీకి కూడా నిరాశాజనకమయిన నిస్తేజాన్ని అంటగడతాడు. అందుకే, ప్రస్తుతం భార్యలు ఏమిటో గతంలోని భర్తల ప్రవర్తన రుజువు చేస్తుంది. ఆరంభంలో చాలామంది నూతన వధువులు ఈ అణిచివేతకి వ్యతిరేకంగా తిరగబడడానికి ప్రయత్నిస్తారు. భర్తల గొంతెమ్మ కోరికలకి విరుద్ధంగా గొంతు విప్పడానికి చూస్తారు. అయితే అనేక రకాలయిన బెదిరింపులకో, హత్యలకో బలవుతూనే ఉంటారు. కొందరు ఆత్మవిశ్వాసం గల స్త్రీలు ఈ కసాయిగృహాల నుంచి పారిపోగలుగుతారు. అయితే, చాలా సందర్భాల్లో వార్ని ఈడ్చుకురావడం జరుగుతుంది. కీర్తి, గౌరవం, మర్యాద, పరువు వంటి పదాలతో వారి బతుకు గంగపాలవుతుంది. ఈ రెండో సమస్యను కూడా అధిగమించిన స్త్రీలు జీవనక్రమంలోని ఇతర ఎత్తుపల్లాల్ని అధిగమించగలుగుతారు. ఇంటిదగ్గర భర్తను సేవించడమే తెలివయినదిగా భావించిన స్త్రీలు అప్రయత్నంగానే అవివేకులుగా, జిత్తులమారులుగా తమని తాము తయారుచేసుకుంటారు. మేధోవంతమయిన ఆంతరిక అంశాల్ని తెలుసుకున్నంతలో మనిషి ఆహారం లేకుండా జీవించలేడు. పస్తులపై ఆధారపడిన ప్రజ్ఞ ప్రాణికోటి బతకడానికి పనికిరాదు. అందుకే, భార్య అణుకువగా, విధేయతగా, అమాయకంగా, అవివేకంగా, పతివ్రతగా భర్త పర్యవేక్షణలో మెలగడానికి అలవాటుపడుతుంది. ఈ క్రమంలో అనుకోకుండానే ఆమె తనకంటూ ప్రత్యేకమయిన ప్రపంచాన్ని సృష్టించుకుని డబ్బులడగడానికి, బేరసారాలు చేయడానికి, చీరలకి నగలకి, ఆభరణాలకి అక్రమ సంబంధాలకి నెలవు ఏర్పర్చుకుంటుంది. భర్తల్ని ప్రేమించే స్త్రీలు లైంగిక సంతృప్తి పొందుతున్నప్పటికీ కూడా చాటుమాటు ప్రేమ వ్యవహారాల ద్వారా భర్తల్ని మోసగిస్తూ తమ మానసిక అణచివేతలోంచి సొంత ఆనందాన్ని పొందుతుంటారు.

స్త్రీని ఆధీనంలో ఉంచుకోవాలనుకునే వెర్రి ఆలోచన భయంకరమయిన అంటువ్యాధిగా పెరిగి వివాహబంధాన్ని ద్వేషపూరితం చేస్తుంది. ఈ అసూయ, తనకి సొంతమయిన ఆస్తిని మరొకరు పంచుకున్నప్పుడు కలిగేలాంటిది. ఇటువంటి ఈర్ష్య

స్త్రీని స్వతంత్రంగా ఆలోచించనివ్వకుండా, భౌతికంగా బలపడనివ్వకుండా, భావోద్రేకాన్ని అనుభవించకుండా అడ్డుపడుతుంది. ఈ పరిస్థితుల్లో పీడనని కొనసాగించడానికిగాను భర్త సాంఘికంగా సంరక్షకుడిగా మాత్రమే కాక సిఐడి అధికారిగా, పోలీసుగా, న్యాయమూర్తిగా, జైలరుగా, తలారిగా అనేక అవతారాలెత్తుతాడు. ఇక భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలు, నమ్మకము ఎలా ఉండగలుగుతాయి? ఈ రకమయిన అనారోగ్య భావనలు, అనుమానపాలోచనలు పెళ్ళికాని స్త్రీ పురుషుల నడుమ కూడా స్వచ్ఛమయిన స్నేహపూరిత సహృదయవాతావరణాన్ని ధ్వంసం చేస్తున్నాయి. చైతన్యరహిత వ్యవస్థలో సామాజిక సాంగత్యం శారీరక సంపర్కంతో సమాప్తమౌతుంది. లైంగిక చర్యకోసమే జనించే వాంఛ, ఆలుమగల మధ్యన ఆత్మీయ అనుబంధం పెంపొందకుండా అడ్డుగోడవుతుంది. పరిపక్వతలేని సంఘ పరిస్థితులు ఇలాంటి వెనకబడిన ఘటనలకి కారణమవుతాయి. ఈ రకమయిన అనుమాన దృక్పథానికి, ఒంటరి దృక్కోణానికి బలయిపోయిన మన విజ్ఞత తాత్కాలికంగా పాతివ్రత్య పరిరక్షణకి దోహదపడిందని సంబరపడినా, అంతిమంగా సాధించినదానికంటే కోల్పోయిందే యదార్థంగా ఎక్కువని తేలుతుంది. స్త్రీని బంధించి ఉంచాలనుకునే మగాడి దుండగ మనస్తత్వం ఆమెకి సహజ పురుషద్వేషాన్ని పుట్టించేలా ఉంటుంది. కృత్రిమమయిన విలువలతో కూడిన సమాజంలో, విపరీతమయిన అతిశయోక్తులతో నిండిన మతవ్యవస్థలో, మేధోవంతమయిన నైతిక పరిణామాన్ని స్త్రీ అవగతం చేసుకోవడం కష్టసాధ్యం. అలాంటప్పుడు యువత అనైతిక దిగజారుడుతనాన్ని ఆపడానికిగానూ, అంతకంటే ప్రమాదకరమయిన పతనానికి వార్ని దగ్గరచేయడం జరుగుతోంది. అలౌకిక స్థాయిలో అవలంబించే శీలరక్షణ పద్ధతులు యువతని పెడదోవపట్టించడానికి పనికొచ్చినంతగా, ప్రయోజకుల్ని చేయడానికి పనికిరావడం లేదన్నది వాస్తవం. ఆటలమ్మ జబ్బుకి వేసే టీకామందులాగా, ఆడవారి పట్ల మగాళ్ళ విపరీత పోకడలు సాగుతున్నాయి. అత్యుత్సాహం ప్రదర్శించడం రోగ నివారణకి మార్గం కానట్లే పాతివ్రత్య విధానాలు నైతిక నాగరికతకి నిదర్శనం కావు. స్త్రీలపై తల్లిదండ్రులు, భర్తలు వ్యవస్థ చూపించే అనుమానపు వైఖరి తెలీకుండానే వారిని తమ అస్తిత్వ సహజ లైంగికపోకడల్ని తీర్చుకునేలా చేస్తుంది. ఈ సాంప్రదాయకమయిన నైతికత నిజంగా స్త్రీ పురుషుల్లో నిష్కపటత్వాన్నీ, నిజాయితీగల స్వేచ్ఛాపిపాసను పెంచేందుకు పనికొస్తుందనుకుంటే



కనుక మనం వెంటనే ఈ వ్యవస్థపై తిరగబడి సమాజ స్వరూపాన్ని సమూలంగా మార్చేందుకు ముందుకురావచ్చు. ఆలుమగల స్వాతంత్ర్యాన్ని నిర్ద్వంధంగా ప్రతిబింబిస్తుందనుకుంటే ప్రపంచానికి సైతం వ్యతిరేకంగా ప్రతిఘటించడానికి ప్రయత్నం చేయవచ్చు.

స్త్రీ స్వతంత్రానికి, స్వేచ్ఛకి విరుద్ధంగా వాదించబడే రెండు తెలివైన వాదనలున్నాయి – ఇంటి పాలన, ఆజ్ఞాపాలన. ఇందులో మొదటిది స్త్రీకి ఇంటిపై సర్వహక్కులూ కలిగి ఉంటాయంటుంది. కానీ ఆ హక్కులన్నీ పురుషుడి చేత నియంత్రించబడతాయనే విషయాన్ని ఇది వ్యతిరేకించదు. ఏ క్షణంలోనయినా పురుషుడు తనకి నచ్చిన మార్పుల్ని పరిచయం చేయడానికి, పనికత్తెని తొలగించడానికి ప్రజల ఆమోదయోగ్యమయిన అధికారాన్ని కలిగి ఉంటాడు. ఆర్థికత అతడి ఆధిక్యతను సమర్థిస్తుంది. అసలు స్త్రీ స్వతంత్రురాలని నిరూపించడానికి పురుషుడెవరనేది ప్రశ్న? స్త్రీకి స్వేచ్ఛని ప్రసాదించి ఉద్ధరించడానికి మగాడికున్న అర్హత ఏంటనేది ప్రశ్న? స్త్రీకి ఇవ్వబడిందని చెప్పబడుతున్న అధికారం నిజానికి ఇంటిని చక్కదిద్దడానికి ఇవ్వబడలేదు. అది ఆమె తనని తానే నియంత్రించుకునేలా రూపొందించబడి స్త్రీల భావనల్ని, చర్యల్ని, రాబడిని దోచుకుందుకు నిర్దేశించబడింది. అల్పసంతోషిగా ఆమెను తయారుచేసి స్వల్ప సంతృప్తికే పొంగిపోయి కట్టుబడేలా కుట్ర చేయబడింది. తనని తాను పాలించుకోడానికి పనికిరాని స్త్రీ ప్రపంచాన్ని పరిపాలించి ఉపయోగమేమిటి?

ఇక రెండో వాదన పరమార్థమేమంటే, స్త్రీకి స్వేచ్ఛా, స్వాతంత్రాలు మంచి చేయడానికి ఇవ్వబడ్డవి కానీ, ఇష్టానుసారం మెలిగేందుకు ఆ ఆదేశాలు పనికిరావని. తన విషయంలో సరిగానే పురుషుడికి కనబడే స్వేచ్ఛ, స్త్రీ వద్దకొచ్చేటప్పటికి మాత్రం విశృంఖలత్వంగా మారిపోతుంది. అందుకే, స్త్రీ స్వాతంత్ర్యం దారితప్పకుండా కూడా పాపం పురుషుడే కాపలా కాస్తుంటాడు. మరి మగాడ్ని నియంత్రించేదెవరు? సమాజం, అంతరాత్మ. అదే సమాజాన్ని స్త్రీని కూడా పాలించమనండి. మధ్యలో పురుష పెత్తనం ఎందుకు? మగాడి ప్రమేయం దేనికి? పురుష స్వేచ్ఛ, విశృంఖలత్వంగా మారకుండా ఉండడానికిగాను పురుషుడేమయినా స్త్రీచేత నియంత్రించబడుతున్నాడా? స్త్రీపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించే పురుషపుంగవులకి అసలు స్వాతంత్ర్యం అంటే తెలుసా? అతడు తనకొక న్యాయం, స్త్రీకొక న్యాయం అనే పద్ధతినే పాటిస్తున్నాడు. అతడిది దైవేచ్ఛ. ఆమెది మాత్రం మానవేచ్ఛ. ఏ మనిషయినా తన వ్యక్తిగత వ్యవహారాలపై

ఇతరుల పెత్తనాన్ని భరించలేరు. ఏ వ్యక్తయినా తన స్వంత విషయాలలో అధికారిక ప్రవేశాన్ని సహించలేడు. తన హక్కులు కాలరాయబడడాన్ని ఊరుకోలేరు. ఒకరి సహజమయిన అభివృద్ధికి ఇది అవాంతరమవుతుంది. ఒకరున్నది తప్పుతోవలోనని బలవంతపెట్టే హక్కు భగవంతుడికి కూడా లేదు. చట్టం కానీ, వ్యవస్థకానీ వ్యక్తిపై ఇటువంటి భారం మోపితే ఆ వ్యక్తి తనని తానే ఆత్మహత్య చేసుకోవాలి. తనని పీడిస్తున్న వారి పీడ శాశ్వతంగా వదిలించుకోడానికి ప్రయత్నించాలి. లేదా తనకి తానే జీవితానికి ఆఖరి అంకంగా చరమగీతం పాడుకోవాలి. ఇక్కడ ప్రతీ స్త్రీ కూడా తన పవిత్రతని పచ్చుళ్ళలా భద్రపరిచే ఒక పురుషుడ్ని నైతిక సంరక్షకుడిగా కలిగి వుంటుంది. సామాజిక భద్రత పేరుతో, సాంఘిక ఆరోగ్యం అంటూ ముసుగు వేయబడిన ఈ పాతివ్రత్య పరిరక్షణ నిజానికి పురుషుడి వ్యక్తిగత ప్రయోజనం కోసం మాత్రమే. ఇది అత్యంత దారుణమయిన పీడన. చాలా నీచమయిన క్రూరవేదన. పురుషోన్మాదానికి తలుపులు తెరిచే భయంకరమయిన బానిసక్రీడ. అయితే, ప్రపంచమింకా ఈ నేరాల్ని చూడడానికి తన నేత్రాలు పూర్తిగా తెరవలేదు.

ఈ విధంగా రోజువారీ అణిచివేతకి అలవాటుపడిన బానిసత్వం క్రమంగా ఒంటరిగా ఉండడానికి ఇష్టపడుతుంది. ఒక వ్యక్తిగా శక్తివంతమయిన సానుభూతితో తన సమస్యాత్మక వాతావరణాన్ని దర్శించగలుగుతుంది. అధికారం, సంప్రదాయం, చట్టం, పురాణాలు, మతగ్రంథాలు, నైతిక నియమాలు బోధించినవాటికి భిన్నంగా స్త్రీ మేలుకొని స్వేచ్ఛాలోచన చేయడం వ్యవస్థని వణికిస్తుంది. స్త్రీ స్వతంత్రం సమాజానికి కంపరం పుట్టిస్తుంది. ఈ విషయంలో మొట్టమొదట చెయ్యవలసింది స్త్రీని సంపాదించేదిగా తన కాళ్ళపై నిలబడేదిగా చేయగలగడం. ఆర్థికంగా స్త్రీ స్వతంత్రురాలు కాకుండా ఎన్ని సంస్కరణలొచ్చినా ఆమెకు సాయపడలేవు. స్త్రీలు ఆర్థికంగా, నైతికంగా చాలినంత బలపడి ఉంటూ ఎటువంటి అవాంతరాలనయినా అధిగమించేవారిగా తయారవ్వాలి. అవసరమయితే తల్లిదండ్రుల్ని, భర్తని, పిల్లల్ని, ఇంటిని కూడా విడవడానికి సిద్ధపడాలి. ఆలోచనాపరులయిన ఆలుమగలంతా పుచ్చిపోయిన ఈ కుటుంబ వ్యవస్థని పెరికిపారేసి సొంత వ్యక్తిత్వంకల సమాన స్థాయి వ్యక్తులు గల సమాజాన్ని నిర్మించాలి. కుళ్ళిపోయి కంపుకొడుతున్న ఈ తప్పుడు కుటుంబ భావనలకి విరుద్ధంగా ప్రత్యేక అభిరుచులకి స్వేచ్ఛయిచ్చే నవసంఘాన్ని రూపొందించాలి. స్త్రీ విధేయత, పురుష నియంత్రణకి అతీతంగా మనలేని పరిస్థితులలో, స్త్రీ అణిచివేత, పురుషాధిక్యతని విస్మరించలేని వ్యవస్థలలో కుటుంబాలనేవి అదృశ్యం అవడమే మంచిది. స్త్రీ స్వేచ్ఛకి అవకాశం లేని సమాజంలో కుటుంబమనేది కచ్చితంగా అంతం కావలసిందే. నియమ నిబంధనలతో నిండిన వైవాహిక సంబంధాన్ని అంగీకరించేందుకు స్త్రీ ముందుకు రాకూడదు. షరతులతో కూడిన వివాహ అనుబంధాన్ని కొనసాగించేందుకు స్త్రీ సిద్ధం కాకూడదు. సంపూర్ణమయిన స్వేచ్ఛాస్వాతంత్ర్యాల్ని, సమాన హక్కుల్ని స్వీకరించే బాధ్యతని ఆమె గుర్తించాలి. స్త్రీపట్ల పురుషప్రయత్నంతో జరిగే అభివృద్ధి సంస్కరణలన్నీ సంపూర్ణం కావు. విద్యాపథకాలు, సాంఘిక సంస్కరణలు, దాంపత్య సంబంధ చట్టాలు అన్నీ పురుష మనసుతో కుట్రపూరితంగా కల్పించబడినవే. బాలికోన్నత పాఠశాలలు బాలికల కోసమే రూపొందించబడిన పాఠ్యాంశాలతో బాలికల్ని మూఢుల్ని చేస్తున్నాయి. పెళ్ళి తంతులు, కళ్యాణ క్రతువులు బానిసల్ని ఎక్కువ చేస్తున్నాయి. స్త్రీపై తన ఆధిక్యతా భావాన్ని పూర్తిగా తొలగించుకోడానికి నిజాయితీగా చేసే ప్రయత్నం ఒక్కటే పురుషుడు చేయగలిగింది, చేయవలసినదీను. కుమార్తె తప్పొప్పుల్ని ఆమె సరిజేసుకునేలా కూతురుకి స్వేచ్ఛనివ్వడం తండ్రిగా అతడికి మంచిది, ఆమె ప్రేమను నియంత్రించే కంటే, మనస్ఫూర్తిగా స్వాగతించి ఆమె పనిమనిషిగా మారినా, వ్యభిచారిలా మారినా అది ఆమెకే వదిలేయాలి. స్త్రీ జ్ఞానార్జనకి అనుమతించబడాలి. తన భౌతిక-బౌద్ధిక సౌందర్యాల్ని, తన జీవన సహచరుల్ని, తనవారయిన సొంత పిల్లల్ని, సొంత తప్పుల్ని ఎంచుకోగలిగిన స్వేచ్ఛ ఆమెకుండాలి. ఆమెను ఒంటరిగా వొదిలేయండి!

# ముగింపు

1. పురుషుడు స్త్రీని తనకంటే నీచంగానూ పరిగణించకూడదు, తన కంటే ఉత్తమంగానూ చూడకూడదు. సమాన సహజ సహచరిగా భావించాలి.
2. స్త్రీ పురుషుల విషయంలో ద్వంద్వ వైఖరితో వ్యవహరించే అన్ని చట్టాలు రద్దుచేయాలి. అలాగే గర్భాధారణ సమయంలో స్త్రీకి వర్తించే ప్రత్యేక సౌకర్యాలు కచ్చితంగా పాటించబడాలి.
3. ప్రతీ స్త్రీ కూడా వైవాహిక జీవితంతో సంబంధం లేకుండా ఆమె కొరకు సంపాదించుకోవాలి.
4. స్త్రీపట్ల తన చంచలమయిన చపలచిత్త బలవంత బాధ్యతల్ని పురుషుడు వెనక్కు తీసుకుని, అవి ఏర్పర్చుకుని తమ తప్పుల్ని నష్టాల్ని పూడ్చుకునే అవసరాన్ని అవకాశాన్నీ స్త్రీ యిచ్చకే వదిలేయాలి.